


ఒక రోజు ముందే జిల్లాకు మంత్రి లోకేశ్



పార్వతీపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీఎం పర్యటనకు ఒక రోజు ముందే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ జిల్లాకు రానున్నారు. గురువారం రాత్రి ఏడు గంటలకు భామిని చేరుకుంటారు. రాత్రి 7.30 గంటల నుంచి 9.30గంటల వరకు పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించి.. భామిని మండలంలోనే రాత్రి బస చేస్తారు. శుక్రవారం సీఎం చంద్రబాబుతో కలిసి భామిని ఆదర్శ పాఠశాల మెగా పీటీఎంలో పాల్గొంటారు.



సీఎం పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు

మంత్రి లోకేశ్ కూడా రాక

- రేపు జిల్లాకు విద్యాశాఖ మంత్రి
- భామిని ఆదర్శ పాఠశాలలో మరమ్మతు పనులు
- హెలీప్యాడ్ స్థలం పరిశీలించిన జేసీ, సబ్ కలెక్టర్

భామిని, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన నేపథ్యంలో అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 5న భామిని ఆదర్శ పాఠశాలలో నిర్వహించనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో సీఎం పాల్గొనున్నారు. దీంతో అధికారులు ఏర్పాట్లలో బిజీబిజీగా ఉన్నారు. మంగళవారం ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో (మిగతా 6వ పేజీలో..)



హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు



ఆదర్శ పాఠశాలకు మెరుగులు దిద్దుతున్న దృశ్యం



భామిని ఆదర్శ పాఠశాలలో పనులు చేస్తున్న దృశ్యం

మెగా పీటీఎం నిర్వహణకు సన్నద్ధం

- జిల్లావ్యాప్తంగా 5న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు
- పాఠశాలల్లో ఏర్పాట్లు
- భామినిలో సమావేశానికి హాజరుకానున్న సీఎం

పార్వతీపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ (పీటీఎం)కు జిల్లా అధికారులు సన్నద్ధమవుతున్నారు. మూడోసారి జిల్లాలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబునాయుడు రానున్నారు. భామిని ఆదర్శ పాఠశాలలో నిర్వహించనున్న పీటీఎంలో పాల్గొనున్నారు. దీంతో జిల్లా అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా నాలుగో తేదీన జిల్లాకు రానున్న నేపథ్యంలో భామినితో పాటు మన్యంలోని మిగతా పాఠశాలల్లోనూ పీటీఎం నిర్వహణకు సర్వం సిద్ధం చేస్తున్నారు. 2024, డిసెంబరు 7న, 2025 జూలై 10న జిల్లాలో పీటీఎంలు జరిగాయి. తాజాగా శుక్రవారం మూడోసారి సమావేశం చేపట్టేందుకు విద్యాశాఖ సన్నద్ధమవుతోంది.

సమావేశం ఇలా..

ఈనెల 5న ఉదయం 9గంటల నుంచి 9.30 గంటల మధ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పూ ర్వ విద్యార్థులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, సామాజిక సేవ కులు పాఠశాలలకు హాజ రవుతారు. 10.50 గంటల వరకు విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను ఉపాధ్యాయులు వివరిస్తారు. బోధనలో అవలంబిస్తున్న నూతన విధానాలను వీడియోరూపంలో ప్రదర్శిస్తారు. అనంతరం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగే సమావేశంలో పిల్లల ప్రగతి నివేదికలను తల్లిదండ్రు లకు అందిస్తారు. ఇళ్ల, పాఠశాలల్లో విద్యార్థుల నడవడిక, వారి ప్రవర్తన, చదివే తీరు, పరీక్షల్లో మార్కులు, నైపుణ్యాలు తదితర అంశాలను చర్చిస్తారు.

టెన్త్ పరీక్షల సన్నద్ధతపై చర్చ..

టెన్త్ ఫలితాల్లో జిల్లా వరుసగా మూడుసార్లు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సారి కూడా మొదటి స్థానం (మిగతా 6వ పేజీలో..)

నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపడతాం: ఎస్పీ 6లో



స్థానిక ఎన్నికల్లో పసుపు జెండా ఎగురవేయండి
● మంత్రి సంధ్యారాణి 6లో



కళ్లికోటలో ఏనుగులు
● టమాటా పంట ధ్వంసం 4లో



పైడిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు 4లో



పనులు పూర్తికావు.. సాగునీరు అందదు

- ఇదీ ప్రాజెక్టుల పరిస్థితి
- అధ్వానంగా కాలువలు
- ఆయకట్టుదారులకు తప్పని ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



జంఝావతి హైలెవెల్ కెనాల్ పరిస్థితి ఇదీ..

పార్వతీపురం రూరల్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మండలంలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు మోక్షం లభించడం లేదు. వాటి పనులు ఎప్పటికి పూర్తవుతాయో.. ఇంకెప్పటికి సాగునీరు అందిస్తాయో తెలియని పరిస్థితి నెల కొంది. గత ప్రభుత్వం వాటి నిర్వహణపై దృష్టి సారించలేదు. కాలువలను సైతం పట్టించుకోలేదు. దీంతో ఆయా ప్రాజెక్టుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. అడారుగెడ్డ, జంఝావతి హైలెవెల్ కెనాల్, వరహాల గెడ్డ పరిధిలో ఆయకట్టుదారులు సాగునీటికి కట కటలాడుతున్నారు. ఏటా వరుణుడిపై ఆధారపడి సాగు చేసుకో వాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో వారంతా కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.

అడారుగెడ్డ రిజర్వాయర్

కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో అడారుగెడ్డ వద్ద రిజర్వాయర్ నిర్మించారు. సుమారు 80 శాతం పనులు పూర్తి చేశారు. ఈ రిజర్వాయర్ ద్వారా కనీసం ఆరు వందల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఆ తర్వాత చాలా ప్రభుత్వాలు మారినా.. వివిధ కారణాలతో (మిగతా 6వ పేజీలో...)



వరహాలగెడ్డ కాలువ ఇలా..

ఆవాస్ ప్లస్ యోజనకు

గడువు పొడిగింపు



గరుగుబిల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస్ ప్లస్ యోజన పథకానికి గడువు పొడిగించారు. ఈ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. గతనెల 30వ తేదీ వరకు గ్రామాల్లో సర్వే నిర్వహించారు. అర్హులైన వారికి గృహాలు మంజూరుకు ఇంటింటా సర్వే చేశారు. పంచాయతీ పరిధిలో స్థలం ఉన్నా, లేకపోయినా గృహాల మంజూరుకు జియో ట్యాగింగ్ నిర్వహించారు. మొత్తంగా జిల్లాలో 28,533 మంది లబ్ధిదారులను గుర్తించారు. అయితే మరికొంతమంది అర్హులు ఉన్నారన్న సమాచారంతో ఈ నెల 14వ తేదీ వరకు గడువు పొడిగిస్తూ ఉన్నతాధి కారులు ఆదేశాలు జారీ చేశారు. కాగా ఈ నెల 3 నుంచి గతంలో నమోదైన వారి వివరాలు పరిశీలించ నున్నారు. త్రిసభ్య కమిటీ మండల పరి షత్ అధికారి, గృహ నిర్మాణ శాఖ ఏఈ, సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ధ్రువీకరించిన తర్వాత గ్రామసభ ఆమోదం పొందాల్సి ఉంది. ఈనెల 14 వరకు చక్ర వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. దీనిపై హౌసింగ్ ఈఈ జి.సోమేశ్వరరావును వివరణ కోరగా.. ఆవాస్ ప్లస్ యోజన సర్వే గడువు పొడి గింపు వాస్తవమేనని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఏఈలు నిశితంగా పరిశీలించి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

వంశధారపై వంతెన

- లివిరి వద్ద నిర్మాణానికి ఒడిశా గ్రీన్‌సిగ్నల్
- రూ.46 కోట్లు మంజూరు

భామిని, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భామిని మండలం లివిరి వద్ద వంశధార నదిపై వంతెన నిర్మాణానికి ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు 46 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే దీనిపై ఏపీ నుంచి అను మతులు మంజూరు కావల్సి ఉంది. గజపతి రాజుల ఇష్టదైవం.. వారు నిర్మించిన గోపీనాథ ఆలయం లివిరిలో ఉంది. ఇక్కడకు గజపతి రాజుల వారసులతోపాటు ఒడిశా నుంచి ఎక్కువగా భక్తులు వస్తుంటారు. హోలీ ఉత్సవాలకు పర్లాకిమిడి, కాశీనగర్, గుణుపూర్ తదితర ప్రాంతాల నుంచి జనం తలివస్తుంటారు. కాగా అప్పట్లో నౌపడ నుంచి గుణుపూర్ వరకు నడిచే నేరోగేజ్ రైలు ప్రయాణికులు, భక్తులకు ఎంతో ఉప యుక్తంగా ఉండేది. అయితే కాలక్రమంలో ఆ రైలు మార్గం బ్రాడ్ గ్రేజ్ మారింది. దీంతో ఒడిశా భక్తులు వంశధార నది దాటి లివిరి ఆలయానికి చేరుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆంధ్రా-ఒడిశాను రవాణా మార్గాన్ని అనుసంధానం చేస్తూ వంశధారపై వంతెన నిర్మాణానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.

గజపతి జిల్లా కాశీనగర్ బ్లాక్ పరిధిలో ఉన్న బొత్తవ నుంచి వంశధార నది లివిరి గ్రామం వరకు వంతెన నిర్మించేందుకు అంగీకారం తెలిపింది. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే ఇరు రాష్ట్రాల నదీతీర ప్రాంతవాసులకు పడవ ప్రయాణం తప్పుతుంది.

గిరిజన జాతిని అవమానిస్తారా? 6లో
● ఐటీడీఏ అధికారుల తీరుపై గిరిజన సంఘాల ఆగ్రహం

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ 6లో

7న పార్వతీపురంలో హైందవ సభ 6లో

విద్యా ప్రమాణాల స్థాయి పెరగాలి
● డిప్యూటీ ఈవో రామ్మోహనరావు

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు: జేసీ



సంతోషపురం రైతుసేవా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ

గరుగుబిల్లి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): రైతుసేవా కేంద్రాల పరిధిలోని సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఉల్లిభద్రలో రైస్ మిల్లుతో పాటు సంతోషపురంలోని రైతుసేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు సమయంలో విధిగా నిబంధనలు పాటించాలన్నారు. రైతులకు అందుబాటులో సిబ్బంది ఉండాలని సూచించారు. వారికి అసౌకర్యం కలిగించ రాదన్నారు. రైతులు ఏ మేరకు కేంద్రాలకు ధాన్యం విక్రయించారు.. ట్రక్ షీట్లు, తదితర సమాచారాన్ని ఏవో టి.జ్యోత్స్నను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ధాన్యం నిల్వలు తడవకుండా టార్పాలిన్లు సరఫరా చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ధాన్యం నిల్వలు తడిసినట్లయితే రైతులకు అవసరమైన సూచనలు అందించాలని ఆదేశించారు. పలువురు మిల్లర్లు రైతుల నుంచి 4 కిలోలు అదనంగా వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. నిబంధనలు పాటించకుంటే మిల్లర్లపై చర్యలు తప్పవన్నారు.

మూడేళ్లకుపైగా నిరీక్షణ

- కానిస్టేబుల్ రాత పరీక్ష ఫలితాలు వచ్చి నాలుగు నెలలు
- అయినా ప్రారంభం కాని శిక్షణ
- ఉమ్మడి జిల్లాలో 133 మంది అభ్యర్థుల ఎదురుచూపులు



రాజాం, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి):ఒకటి కాదు.. రెండు కాదు నాలుగేళ్లుగా ఉద్యోగాల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూశారు. ఫలితాలు వచ్చి నాలుగు నెలలు అవుతున్నా శిక్షణ ప్రారంభం కాకపోవడంతో అసహనంతో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో కానిస్టేబుళ్లగా ఎంపికైన 133 మంది పరిస్థితి ఇది. ఈ ఏడాది ఆగస్టు 1న పోలీస్ శాఖ ఫలితాలను ప్రకటించింది. సెప్టెంబరులో శిక్షణ ప్రారంభించి మూడు నెలల్లో పోస్టింగ్ ఇస్తామని చెప్పింది కానీ నాలుగు నెలలు గడుస్తున్నా అతీగతీ లేకపోవడంతో అభ్యర్థుల్లో ఒకటే ఆందోళన.

రాష్ట్రంలో సుదీర్ఘకాలం కొనసాగిన కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ ఇదే. ఈ విషయంలో వైసీపీ ప్రభుత్వం తప్పిదానికి పాల్పడింది. ఏటా జాబ్ కాలెండర్ అంటూ 2019 ఎన్నికల ప్రచారంలో ఆర్భాటం చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక జాబ్ కాలెండర్ ఒకసారి కూడా విడుదల చేయలేకపోయారు. 2022 నవంబరులో రాష్ట్ర వ్యాప్తంగా 6100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి పోలీస్ శాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. అందులో ఉమ్మడి జిల్లాకు 133 పోస్టులు కేటాయించారు. అయితే ప్రాథమిక రాత పరీక్షను నిర్వహించిన వైసీపీ ప్రభుత్వం తరువాత చేతులెత్తేసింది. అభ్యర్థులు విన్నపాలు చేసినా కుంటిసాకులు చెబుతూ తప్పించుకుంది. ఈ తరుణంలో కూటమి అధికారంలోకి రావడంతో కానిస్టేబుళ్ల నియామకాలకు సంబంధించి న్యాయ చిక్కుముడులను పరిష్కరించి ఈవెంట్స్‌తో పాటు తుది రాత పరీక్ష నిర్వహించింది. ఆగస్టులో ఫలితాలు ప్రకటించింది. కానీ నాలుగు నెలలు గడుస్తున్నా శిక్షణ ప్రారంభించకపోవడంతో అభ్యర్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. వైసీపీ ప్రభుత్వం తమకు అన్యాయం చేసిందని.. కూటమి ప్రభుత్వం న్యాయం చేసిందనుకుంటే.. శిక్షణలో జాప్యం జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● కానిస్టేబుళ్ల నోటిఫికేషన్ జారీ చేసి మూడేళ్లు దాటి దాదాపు నాలుగేళ్లు సమీపిస్తోంది. ప్రభుత్వ కొలువు కావడంతో వందలాది మంది పోస్టు గ్రాడ్యుయేషన్ అభ్యర్థులు సైతం జిల్లాలో పోటీపడ్డారు. ఈ మూడేళ్లలో (మిగతా 6వ పేజీలో...)

పారదర్శకంగా ఆరోగ్య సర్వేలు చేపట్టాలి

- డీఎంహెచ్‌వో భాస్కరరావు

భామిని, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సర్వేలు పారదర్శకంగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు ఆదేశించారు. వ్యాధి లక్షణాలు స్పష్టంగా గుర్తించాలన్నారు. మంగళవారం ప్రోగ్రాం అధికారులతో కలిసి భామిని పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. ఆసుప త్రిలో సేవలు, మందులు, వైద్య పరీక్షలపై ఆరా తీశారు. అనంతరం ఆశాడేకార్యక్రమంలో పాల్గొని గ్రామీణ వైద్య సేవలపై సమీక్షించారు. మాతా, శిశు ఆరోగ్య సేవలపై ప్రత్యేక దృష్టిసారించి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. నిరంతరం పర్యవేక్షించాలని , అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అన్ని వేళలా రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి, జిల్లా ఆర్‌బీఎస్‌కే అధికారి టి.జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

21న పల్స్‌పోలియో

పార్వతీపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 21న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు సూచించారు. మంగళవారం స్థానిక ఎన్‌జీవో హోంలో వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులకు రీ ఓరియెంటేషన్ శిక్షణ నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లల జాబితా, మైక్రో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. సర్వేలెన్స్ వైద్యాధికారి జాన్ డీఐవో విజయ్‌మోహన్, ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారులు రఘుకుమార్, వినోద్‌కుమార్ తదితరులున్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో


కోతకు గురైన ముక్కాం సముద్ర తీరం (ఫైల్)

ఎవరికి తెలిపేది ఈ గుండె 'కోత'?

● కెరటాల తాకిడితో భయం ● ఆందోళనలో ముక్కాం గ్రామస్థులు

భోగాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సముద్రతీర ప్రాంతంలోని ముక్కాం గ్రామం తీరం రోజురోజుకూ కోతకు గురవుతోంది. సముద్ర కెరటాలు సమీప రహదారిని నిరంతరం తాకుతూనే ఉన్నాయి. గ్రామానికి.. సముద్రానికి మధ్య సీసీ రహదారి ఉంది. ఈ రహదారి పక్కనే గృహాలు ఉన్నాయి. కెరటాల తాకిడికి సీసీ రహదారి కింద భాగం పూర్తిగా కరిగిపోయింది. సుమారు రెండేళ్ల క్రితం సముద్రం ఉధృతంగా తీరాన్ని తాకడంతో రహదారి పూర్తిగా కోతకు గురవడంతో పాటు సీసీ రహదారిపై ఉన్న విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. అమావాస్య, పౌర్ణమి సమయాల్లో సముద్ర కెరటాలు ఉధృతంగా ఉంటున్నాయి. ఆ సమయంలో రహదారి కోతకు గురవడం సాధారణంగా మారిపోయింది. తుఫాన్ల సమయంలోనైతే భారీ స్థాయిలో అలలు రహదారిని తాకుతూ కోతకు గురిచేస్తుంటాయి. దీంతో తీరం వెంబడి ఉన్న గృహాలు నేలకొరిగే ప్రమాదం ఉందని స్థానిక మత్స్యకారులు ఆందోళనకు గురవుతున్నారు. తీరం కోతకు గురి కాకుండా రక్షణ గోడ నిర్మించాలని మత్స్యకారులు అనేక పర్యాయాలు నాయకులకు, అధికారులకు మొర పెట్టుకున్నా ఫలితం కానరావడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. తుఫాన్ల సమయంలో అధికారులు వచ్చి హడావుడి చేసి వెళ్లి పోతున్నారే గానీ రక్షణ చర్యల విషయం ఆలోచించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి.. తీరంలో రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పైడిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు


అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

విజయనగరం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. మూడు లాంతర్లు వద్ద ఉన్న బాలాలయంలో, స్టేషన్ రోడ్డులో ఉన్న వనంగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పైడిమాంబను వివిధ రకాల పువ్వులతో అలంకరించి... పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు.


అలంకరణలో పైడితల్లి

ఆటోల్లో కుటుంబసభ్యుల ఫొటోలు పెట్టండి

● డీఎస్పీ రాఘవులు

రాజాం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'మీరు నడుపుతున్న ఆటోలలో మీ భార్య, పిల్లల ఫొటోలు పెట్టండి.. ప్రయాణికులతో వెళ్లేటపుడు వారి ఫొటోలను చూస్తూ ముందుకు సాగండి' అని చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు ఆటోడ్రైవర్లకు సూచించారు. ఇలా చేయడం వల్ల మితిమీరిన వేగంతో వాహనాలను నడిపేందుకు భయపడే పరిస్థితులు ఏర్పడతాయని ఆయన అన్నారు. ఇక్కడి ఓ ప్రయివేటు కల్యాణ మండపంలో నియోజకవర్గ పరిధిలోని ఆటోడ్రైవర్లతో మంగళవారం ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడారు. ఇటీవల కాలంలో ఆటో ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆయన గుర్తు చేశారు. నిబంధనలకు లోబడి ఆటోలను నడపాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని, మీతో పాటు మరికొందరి ప్రాణాలు మీ చేతుల్లో ఉన్నాయన్న విషయాన్ని గ్రహించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డీఎస్పీ రాఘవులు హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధి, విధానాలపై సి.ఐ. అశోక్‌కుమార్ వివరించారు.


మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవులు

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

● డీఈవో మాణిక్యంనాయుడు

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థుల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అదనంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని డీఈవో మాణిక్యంనాయుడు ఒక ప్రకటనలో హెచ్చరించారు. బోర్డు విడుదల చేసిన ఫీజు నోటిఫికేషన్ ప్రకారం సాధారణ అభ్యర్థుల నుంచి రూ.125 మాత్రమే వసూలు చేయాలన్నారు. దీనిని మించి వసూలు చేయరాదని స్పష్టం చేశారు. విద్యార్థులు స్వయంగా, లేదా ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అధిక మొత్తాన్ని వసూలు చేస్తున్నారని కొన్ని ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు, మరికొన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఇలా చేయడం సరికాదన్నారు. ఎక్కడైనా అదనంగా ఫీజు వసూలు చేస్తే ఎంఈవోలు, డిప్యూటీ డీఈవోలు, డీఈవో, ఆర్‌జేడీలకు ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు.

విద్యార్థులకు అభినందన..

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 19వ జాతీయ జంబోరి కార్యక్రమం గత నెల 23 నుంచి 29 వరకూ ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగింది. దీనిలో నేపాల్, శ్రీలంక, సౌది అరేబియా దేశాలతో పాటు మన రాష్ట్రంలోని 35 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. మన జిల్లా నుంచి 30 మంది విద్యార్థులు హాజరు కాగా... ఇందులో కొత్తవలస జెడ్పీ పాఠశాల నుంచి 27 మంది ఉన్నారు. హాజరయ్యారు. వీరంతా మంగళవారం జిల్లాకు రావడంతో వారిని డీఈవో మాణిక్యం నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌వోసీ దుర్గా నాగేశ్వరరావు, డీటీసీ కనకలక్ష్మి, సూరిబాబు, డీఈసీ సెక్రటరీ టి.సన్యాసిరాజు, ఉపాధ్యాయులు వాక చిన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో

మహా మంత్ర సప్తాహం ప్రారంభం



సంతకవిటి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో మహామంత్ర సప్తాహం మంగళవారం ప్రారంభమైంది. ఏడు రోజుల పాటు నిరంతంగా హరేరామ హరేకృష్ణ నామాన్ని జపిస్తూ ఈ సప్తాహం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు వివిధ గ్రామాల భజన బృందాలు ఈ సప్తాహ కార్యక్రమంలో పాల్గొన్నాయి. ప్రతిరోజు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఆంజనేయ స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

హరేరామ నామాన్ని జపిస్తున్న దృశ్యం

కళ్లికోటలో ఏనుగులు

● టమాటా పంట ధ్వంసం

కొమరాడ, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): కళ్లికోట పరిధిలో ఏనుగులు గుంపు బీభత్సం సృష్టించింది. గ్రామంలోని సోమవారం రాత్రి బొద్దాన నారాయణరావుకు సంబంధించిన టమాటా పంటను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు ఆవేదన చెందారు. తక్షణమే మా ప్రాంతం నుంచి ఏనుగులు గుంపును తరలించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఏనుగులు సంచరిస్తున్న దృశ్యం

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

బొమన్ సాబ్ లుక్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాజాసాబ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. జనవరి 9న విడుదలవుతోంది. ఈ చిత్రంలో అతీంద్రియ శక్తుల పరిశోధకుడిగా బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ కీలక పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్‌గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను రూపొందిస్తున్నారు దర్శకుడు మారుతి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు.



కథను మలుపుతిప్పే పాత్ర పోషించాను



- సంయుక్త

'అఖండ 2: తాండవం' చిత్రంలో అవకాశం వచ్చినప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఒక మంచి సినిమాలో అవకాశం వస్తే తిరస్కరించకూడదు అని భావించి డేట్స్ అడ్జెస్ట్ చేసుకొని నటించాను. ఈ సినిమాలో కథను మలుపు తిప్పే పాత్ర పోషించాను' అని సంయుక్త అన్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2: తాండవం'. నందమూరి తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక సంయుక్త సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- "అఖండ 2: తాండవం' చిత్రం 'అంచనాలకు మించి ఉండబోతోంది. బోయపాటి గారు గ్రేట్ విజన్‌తో తెరకెక్కించారు. విజువల్స్ అద్భుతంగా ఉంటాయి.
- ఈ చిత్రంలో నా పాత్ర చాలా కీలకంగా, స్టైలిష్‌గా ఉంటుంది. నా కెరీర్‌లో తొలిసారి ఓ మాస్ సాంగ్ చేశాను. ఇలాంటి మాస్ సాంగ్ ఇప్పటివరకూ చేయలేదు. చాలా కష్టపడ్డాను. ప్రాక్టీస్ చేసే సమయంలో మోకాలు దెబ్బతిని సహకరించకపోవడంతో ఫిజియోథెరపీ చేయించుకున్నా.
- బాలకృష్ణ గారు దర్శకుల నటుడు. వారు ఎలా చెబితే అలా చేస్తారు. నటుడిగానూ ఆయన విజన్ అద్భుతం. సెట్‌లో ఆయన చాలా స్నేహంగా ఉండేవారు. ఆయన నటించిన 'డాకూ మహారాజ్' నా ఫేవరేట్ చిత్రం.
- తమన్ సంగీతం, ముఖ్యంగా సంస్కృత శ్లోకాలతో సాగే నేపథ్య సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది. మా నిర్మాతలు రామ్, గోపీ గారు మేకింగ్‌లో రాజీ పడలేదు. సినిమాను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కథానాయికగా స్వయంభు, నారీ నారీ నడుమ మురారి చిత్రాలు చేస్తున్నాను.

అఖండ 2 టికెట్ ధరల పెంపు

- ఏపీ ప్రభుత్వ అనుమతి

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2' సినిమా టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం అనుమతిచ్చింది. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలవుతోంది. నిర్మాతల వినతి మేరకు భారీ బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి జారీ చేస్తోంది. అందులో భాగంగానే ఈ సినిమా విడుదలైన తొలి పది రోజులు టికెట్ ధరలు పెంచుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు పూర్తి అనుమతి లభించింది. సింగిల్ స్ర్కీన్లలో సాధారణ రేటుపై రూ. 75, మల్టీప్లెక్స్‌ల్లో రూ. 100 పెంపునకు అనుమతించింది. ఈ నెల నాలుగున ప్రదర్శించే ప్రీమియర్ షో టికెట్ ధర రూ. 600గా నిర్ణయించారు.

విందు భోజనంలా ఎంజాయ్ చేసే సినిమా

క్రికెట్ క్రీడ నేపథ్యంలో కామెడీ ప్రధానాంశంగా రూపుదిద్దుకున్న చిత్రం 'గేట్'. సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించారు. ఎం. చంద్రశేఖర్ నిర్మించారు. మంగళవారం నిర్మాత దిల్‌రాజు టీజర్‌ను విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 'అడ్డంకులను దాటుకొని ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దాం. మంచి అభిరుచితో చేసిన సినిమా ఇది. ప్రేక్షకులు విందు భోజనంలా ఎంజాయ్ చేస్తారు. మణిశర్మ నేపథ్య సంగీతం సినీ ప్రియులను మెప్పిస్తుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. సహ నిర్మాత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాను మాస్ ఎంటర్‌టైనర్‌గా తీశాం. చంద్రశేఖర్ రెడ్డి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు' అని తెలిపారు. ఆద్యంతం వినోదం పంచే చిత్రమిదని దివ్యభారతి తెలిపారు.

యువతకు కనెక్ట్ అయ్యే కథ

రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమకథా చిత్రం 'సైక్ సిద్ధార్థ్'. శ్రీనందు, యామిని భాస్కర్ జంటగా నటించారు. వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీనందు, శ్యామ్ సుందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో



చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీనందు మాట్లాడుతూ 'ఇప్పుడున్న సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యే కథతో తెరకెక్కిన చిత్రమిది. సురేశ్‌బాబు గారు సినిమా చూసిన వెంటనే పంపిణీ చేసేందుకు అంగీకరించారు. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను తీసుకోవడంతో నా కల నెరవేరినట్లయింది' అని చెప్పారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు చక్కని ప్రేక్షకాధరణ దక్కింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్ర్కీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అని చెప్పారు.

అనుమాన పక్షి వచ్చేది అప్పుడే

రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలక ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక, రాజేశ్ జగ్గియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా విడుదల తేదీని వెల్లడిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. వినోద ప్రధానంగా సాగే ఈ సినిమా విమల్ కృష్ణ మార్క్‌తో స్టైలిష్‌గా ఉండనుందని చెప్పారు. రాగ్ మయూర్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. అతిగా ఆలోచిస్తూ, అతి జాగ్రత్తతో ఉండే ఆయన రోల్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాక, కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ అన్నారు. బ్రహ్మాజీ, ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: సునీల్‌కుమార్ నామా, సంగీతం: శ్రీచరణ్ పాకాల.




ప్రేమ కోసం యుద్ధం



రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా 'కలర్ ఫొటో' ఫేమ్ సందీప్ రాజ్ తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. మంగళవారం చిత్రం ట్రైలర్‌ను హీరోయిన్ రష్మిక మందన్న విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్‌లో పాత్రలను, కథా నేపథ్యాన్ని పరిచయం చేసిన విధానం ఆకట్టుకుంది. 'తన ప్రేమ కోసం యుద్ధం చేసే ప్రతీవాడు హీరోనే' అంటూ కథానాయకుడు పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. బండి సరోజ్‌కుమార్ ఈ సినిమాలో విలన్‌గా నటించారు. హర్ష చెముడు కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామ మారుతి ఎమ్, సంగీతం: కాలభైరవ.

కాంతారపై కామెడీ

రణ్‌వీర్ క్షమాపణలు



కాంతార చిత్రంపై తాను చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ మంగళవారం క్షమాపణలు చెప్పారు. ఎవరినీ కించపరచడం తన ఉద్దేశం కాదని తెలిపారు. 'రిషబ్ శెట్టి బాగా నటించారని చెప్పడం కోసమే నేను అలా నటించాను. అలాంటి సన్నివేశాల్లో నటించాలంటే చాలా కష్టం. అయినా ఏ ఇబ్బంది లేకుండా అటువంటి సన్నివేశాలను ఎంతో ఈజ్‌తో చేసే ఆయనంటే నాకు చాలా ఇష్టం. మన దేశంలోని ప్రతీ సంప్రదాయం మీద నాకు అపారమైన గౌరవం ఉంది. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి' అని పేర్కొన్నారు. 'కాంతార'పై రణ్‌వీర్ చేసిన వ్యాఖ్యలపై హిందూ జనజాగృతి సమితి ఫిర్యాదు చేసింది. ఆయన చేసిన కామెంట్స్ హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని పేర్కొంది. గోవాలో ఇటీవలె ముగిసిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) వేడుకల్లో రణ్‌వీర్ 'కాంతార' చిత్రంపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వేదికపై మాట్లాడుతూ "కాంతార' సినిమాలో రిషబ్ శెట్టి నటన అద్భుతం. హీరో పాత్రలోకి దెయ్యం ప్రవేశించినప్పుడు వచ్చే సన్నివేశాలు చాలా బాగున్నాయి" అని రణ్‌వీర్ పేర్కొన్నారు. ఆ సినిమాలో ఎంతో పాపులర్‌గా మారిన 'ఓ' అనే శబ్దాన్ని స్టేజీపై అనుకరించారు. దేవతను ఆయన దెయ్యంగా పోల్చారని కర్ణాటక వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.

వినూత్నంగా వన్ బై ఫోర్



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో తెరకెక్కిన కామెడీ థ్రిల్లర్ 'వన్ బై ఫోర్'. వెంకటేశ్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్ జంటగా నటించారు. బాహుబలి పళని కె. దర్శకత్వంలో రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది.

ఈ సందర్భంగా వెంకటేశ్ పెద్దపాలెం మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ క్రైమ్ డ్రామాను తీశాం. పళని గారి టేకింగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణ. 'హారర్, సస్పెన్స్ అంశాలు, పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ అంశాలతో పాటు మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్' అని చెప్పారు. కథ మీద నమ్మకంతో ఈ చిత్రాన్ని నిర్మించాం, ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది అని నిర్మాతలు తెలిపారు.

విడుదలకు సిద్ధం



భాస్కర్, కోటేశ్వర రావు ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'విధాత'. మణికంఠ రాజేంద్రబాబు దర్శకత్వంలో అప్పిని పల్లె భాస్కర చారి నిర్మించారు. విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మణికంఠ రాజేంద్రబాబు మాట్లాడుతూ 'ఇదో వైవిధ్యభరితమైన చిత్రం. పాత్రలన్నీ సహజ సిద్ధంగా ఉంటాయి' అని అన్నారు. 'ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాము' అని అప్పిని పల్లె భాస్కర చారి తెలిపారు.

జిందాల్‌కు వత్తాసు పలకడం న్యాయమా?

శృంగవరపుకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'మాకు అన్యాయం చేసిన జిందాల్ యాజమాన్యానికి వత్తాసు పలకడం న్యాయమా?' అంటూ భూ నిర్వాసితులు అధికారులను ప్రశ్నించారు. మంగళవారం బొడ్డవరలో జిందాల్ యాజమాన్యానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలో మాట్లాడారు. రైతులకు, స్థానికులకు అండగా నిలబడాల్సిన వారు కార్పొరేట్ కంపెనీలకు మద్దతుగా నిలవడాన్ని తప్పుబట్టారు. భూములు తీసుకున్న సమయంలో శిక్షణ పేరుతో తమ పిల్లల చదువులను మధ్యలో ఆపేసిన యాజమాన్యం ఒడిశాలోని పర్లాకిమిడికి పంపించిందన్నారు. కంపెనీలో షేర్లు ఇస్తామని నమ్మబలికారని ఆరోపించారు. న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.


బొడ్డవరలో నిరసన తెలుపుతున్న జిందాల్ భూ నిర్వాసితులు

రోడ్డుపైకి పశువులు వస్తే గోశాలకు తరలింపు


పశువుల యజమానులతో మాట్లాడుతున్న కమిషనర్, సి.ఐ.లు

రాజాం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఇష్టారాజ్యంగా పశువులను విడిచిపెడితే సింహాచలంలోని గోశాలకు తరలిస్తామని రాజాం మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు, టౌన్ సి.ఐ. కె.అశోక్‌కుమార్ హెచ్చరించారు. మూడురోజుల్లో పశువుల యజమానులు ప్రధాన కూడళ్లలోకి రాకుండా వాటిని నియంత్రించాలని వారిద్దరూ స్పష్టం చేశారు. పట్టణానికి చెందిన పలువురు పశువుల యజమానులతో కమిషనర్ కార్యాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. ఇక్కడి మెయిన్ రోడ్డుతో పాటు బజార్ తదితర ప్రాంతాలలో పశువుల సంచారం పెరిగిపోయిందన్నారు. ఫలితంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గుర్తు చేశారు. హెచ్చరించినా ఫలితం లేకపోవడంతో గోశాలకు తరలించాలని నిర్ణయించినట్లు వారిద్దరూ ప్రకటించారు.

కాలుష్యరహిత సమాజమే లక్ష్యం

రాజాం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు పిలుపునిచ్చారు. కాలుష్య కోరల్లో చిక్కుకుని ప్రజలు అవస్థలు పడుతున్నారని, అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఓ పాఠశాలలో కరస్పాండెంట్ గట్టి పాపారావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పరిశుభ్రత ఇంటి నుంచే ప్రారంభం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వికాసతరంగిణి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు టీటీవీ రమణమూర్తి, హెచ్.ఎం. గట్టి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

●విజయనగరం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, కాలుష్య నియంత్రణకు సహకరించాలని జేఎన్‌టీయూ వీసీ వీవీ సుబ్బారావు అన్నారు. ప్రపంచ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జేఎన్‌టీయూ ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను తీసేసి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లాస్టిక్ లేని క్యాంపస్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ప్రతి విద్యార్థి ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కాలుష్య సమస్యలను ఎదుర్కోవడంలో యువ ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ జయసుమ, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

అమృతహస్తం పథకానికి సహకరించండి

చీపురుపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సహాయంగా వచ్చిన వారి కోసం అమలు చేస్తున్న అమృత హస్తం కార్యక్రమానికి దాతలు మరింత సహకారం అందించాలని డీడీఓ హేమసుందర్ కోరారు. అమృత హస్తం రెండో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్న వారికి ఉచితంగా ఆహారాన్ని అందిస్తుందన్నారు. వారికి సహాయంగా వచ్చిన వారిలో ఎక్కువ మందికి ఆర్థిక స్థోమత లేని కారణంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ జి.శంకరరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సునీల్, రెడ్ క్రాస్ సంస్థ డివిజన్ సమన్వయకర్త బీవీ గోవిందరాజులు, వీవీ నారాయణమూర్తి, వి.మోహనరావు, సూరు రవి, ఎం.కృష్ణమూర్తి, జి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


రోగుల సహాయకులకు ఆహారం అందజేస్తున్న దృశ్యం

పార్టీ బలోపేతానికి ఐక్యతతో కృషి చేయాలి: ఎమ్మెల్యే అదితి


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజయనగరం నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. నగర పార్టీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన గంటా రవి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు హాజరై, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నగరంలోని అన్ని డివిజన్లలో పార్టీని బలోపేతం చేసి, నగర పాలక సంస్థలో పాగా వేయాలన్నారు. పార్టీ నాయకులు గంటా రవి, పీతల కోదండరామ్, గంటా పోలినాయుడు, పాసి అప్పలనాయుడు, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మారెమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

గురజాడ గృహానికి రక్షణ కల్పించాలి

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహాకవి గురజాడ అప్పారావు గృహానికి రక్షణ కల్పించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఈ నెల 1న గురజాడ స్వగృహంలో కొన్ని పుస్తకాలు, టేబుళ్లు, మరుగుదొడ్ల తలుపులు చిందరవందరగా ఉండడంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం తహశీల్దారు కూర్మనాథరావు, వన్‌టౌన్ సీఐ ఆర్‌వీఆర్‌కే చౌదరిలు గురజాడ స్వగృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ ఈ ఏడాదిలో రెండు పర్యాయాలు ఇటువంటి సంఘటనలు జరిగాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు సీసీ కెమెరాలను, రాత్రి పూట కాపలాదారులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గురజాడ కుటుంబ సభ్యులు ఇందిర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


గురజాడ గృహం వద్ద చర్చిస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

భీమసింగి కార్మికుల ఆకలి బాధలను పట్టించుకోండి


నినాదాలు చేస్తున్న కార్మికులు

శృంగవరపుకోట (జామి), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భీమసింగి చక్కెర కర్మాగారం కార్మికుల ఆకలి బాధలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పట్టించుకోవాలని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. మంగళవారం ఫ్యాక్టరీ ఆవరణలో జరిగిన కార్మికుల సమావేశంలో మాట్లాడారు. ఫ్యాక్టరీ మూతపడి ఐదేళ్లు కావస్తోందన్నారు. ఇంతవరకు కార్మికులకు రావాల్సిన పీఎఫ్, గ్రాట్యుటీ చెల్లించకపోవడం అన్యా యమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతో జిల్లాలోని చెరకు రైతులు, కార్మికులు, ఉద్యోగులు వీధిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని భావించినా..ఫలితం కనిపించలేదన్నారు. యువగళం పాదయాత్రలో ఫ్యాక్టరీని తెరిపిస్తామని లోకేశ్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రౌతు కనకరాజు, ఉంగరాల శ్రీను, ఆదిబాబు, చలుమూరి వెంక టరావు, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాశయాలు అవసరం


బహుమతులు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్ బీపీ రావు

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత ఆశయాలతో ముందుకు వెళ్లాలని సుజాత విద్యా సంస్థల డైరెక్టర్ బీపీ రావు అన్నారు. మంగళవారం కొత్త అగ్రహారంలోని బెస్ట్ జూనియర్ కళాశాలలో ఉపకార వేతనాలకు సంబంధించిన పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 380 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా పదో తరగతి విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేస్తున్నామన్నారు. ఈ పరీక్షల్లో తమడ గణేష్, ఒ.లహరి, ఆర్.విష్ణులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరికి బహుమతులతో పాటు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఏ మంగవేణి, ప్రిన్సిపాల్ సాయికుమార్, అకడమిక్ డైరెక్టర్ సూర్యప్రకాష్, ఏవో ఆనందరావు, ప్రిన్సిపాల్ పైడిరాజు, ఉమామహేశ్వరరావు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

15న ఎన్జీఓ ఎన్నికలు

చీపురుపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న ఏపీఎన్జీవో చీపురుపల్లి తాలూకా యూనిట్ ఎన్నికలు నిర్వహించనున్నట్టు అధ్యక్ష, కార్యదర్శులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించి 8న ఉదయం 10 నుంచి 12 వరకూ నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు.

● గజపతినగరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీఓ హోమ్‌లో గజపతినగరం తాలూకా ఎన్జీఓ ఎన్నికలకు ఈ నెల 5న నామినేషన్లు స్వీకరించనున్నట్టు ఎన్నికల అధికారి జె.విక్టర్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్టు తెలిపారు. 12న ఎన్నికలు జరుగుతాయన్నారు.

●భోగాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13న భోగాపురం తాలూకా యూనిట్ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల సంఘ ఎన్నికలు జరగనున్నాయని ఎన్నికల అధికారి ఎల్.అప్పలనాయుడు తెలిపారు. ఈనెల 6న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నామినేషను స్వీకరించనున్నట్టు తెలిపారు.

●శృంగవరపుకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట తాలూకా ఏపీఎన్జీవో ఎన్నికలు ఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు కొత్తవలస తాలూకా అధ్యక్షుడు జె.వి.ప్రసాదరావు ఓ ప్రకటనలో తెలిపారు ఈ నెల 9న ఉదయం 10 నుంచి 12గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్టు తెలిపారు.

శక్తి యాప్‌పై అవగాహన

విజయనగరం క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతే లక్ష్యంగా శక్తి యాప్ వినియోగంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మహిళా పోలీసు స్టేషన్ సీఐ ఈ.నర్సింహమూర్తి తెలిపారు. నగరంలోని ఎంఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్‌లో శక్తియాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శిరీష పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

శృంగవరపుకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్-1 ఆధ్వర్యంలో మంగళవారం బర్మాకాలనీలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ కేశవరావు, ప్రభుత్వ వైద్యుడు శ్రీకాంత్, పీవో భాస్కర్, అధ్యాపకులు వాసుదేవరావు, శ్రీలక్ష్మి, ప్రభాకర్, సంధ్యారాణి పాల్గొన్నారు.

'ఆశా'లపై ప్రభుత్వం నిర్లక్ష్యం

రాజాం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సుమారు రెండు దశాబ్దాలుగా వైద్యసేవలందిస్తున్న ఆశ వర్కర్లపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తోందని ఆ సంఘ నాయకుడు రామ్మూర్తినాయుడు ఆరోపించారు. ఇక్కడి అర్బన్ హెల్త్‌సెంటర్‌లో మంగళవారం వారితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఇంటి పన్ను లక్ష్యాలను సాధించాలి

రాజాం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను వసూలు లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు, మంగళవారం శ్యాంపురం గ్రామంలో ఇంటి పన్నులు వసూలు తీరును పరిశీలించారు. మార్చి నాటికి వసూళ్లను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గడ్డిముడిదాం గ్రామంలో చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు.

రాష్ట్రస్థాయి పరీక్షలకు ఎంపిక

గరివిడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారతీయ విద్యామండలి నిర్వహించిన కౌశల్ 2025 పోటీల్లో శ్రీరాం నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీహెచ్.సూర్యప్రకాష్, ఎల్.నిత్యసారథిలు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. ఈ నెల 27న తిరుపతిలో రాష్ట్ర స్థాయి పరీక్షల్లో పాల్గొంటారని హెచ్ఎం నిర్మల తెలిపారు.

●సంతకవిటి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండవకురిటి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పి.తనుష్ 'కౌశల్ - 2025' క్విజ్ పోటీలో ప్రథమ స్థానాన్ని సంపాదించాడు. 27న తిరుపతిలో జరగబోయే పోటీలకు ఎంపికైనట్టు హెచ్.ఎం. రమణమ్మ తెలిపారు.

న్యూస్ బాక్స్

రైల్వే లోకోపైలట్‌ల 48 గంటల నిరసన

విజయనగరం బాబామెట్ట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా రైల్వే లోకోపైలట్ అసోసియేషన్ పిలుపు మేరకు విజయనగరం రైల్వే లోకోపైలట్‌ల అసోసియేషన్ కార్యాలయం వద్ద 48 గంటల నిరసన కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రైల్వేలో ప్రైవేటీకరణ విధానాలను ఆపాలని అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి సీఐటీయూ నాయకులు టీవీ రమణ, ఎ.గౌరీనాయుడు, ఎ.జగన్మోహనరావు, సోమేష్‌లు సంఘీభావం తెలిపారు.

కోళ్ల మరణాల నిరోధానికి చర్యలు

నెల్లిమర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కోళ్లకు వ్యాధులు రాకుండా చర్యలు తీసుకున్నట్టు పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో 'కోళ్ల పరిశ్రమ విలవిల' అనే శీర్షికన ఆదివారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కోళ్లలో రాణికెటు వ్యాధి వల్ల కొత్త వలసలో కోళ్లు మరణించాయని అన్నారు. మరణాల సంఖ్య పెరగకుండా వ్యాధి నిరోధక టీకాలు వేసినట్టు తెలిపారు. ప్రస్తుతం కోళ్లకు జిల్లాలో ఎలాంటి వ్యాధులు లేవని తెలిపారు.

డిప్యూటీ ఎంపీడీవోగా జనార్దనరావు

బొండపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల డిప్యూటీ ఎంపీడీవో (జీఎస్‌డబ్ల్యుఎస్)గా జి.జనార్దనరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంతవరకు గజపతినగరం ఈవోపీఆర్‌డీగా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

నెల్లిమర్లలో..

నెల్లిమర్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మండల పరిషత్ కార్యాలయం డిప్యూటీ ఎంపీడీవోగా ఎం.రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయనగరం జిల్లా పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. మండలంలోని గ్రామ సచివాలయాలను ఆయన పర్యవేక్షిస్తారు. రవికుమార్‌కు కార్యా లయ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

ఎన్జీవో స్టేట్ కౌన్సిల్ సభ్యుడిగా సత్యారావు

కొత్తవలస, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్జీఓ సంఘం కౌన్సిల్ సభ్యుడిగా వియ్యంపేట పీహెచ్‌సీలో పని చేస్తున్న ఎల్.సత్యారావును ఎన్నుకున్నారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, ఉపాధ్యక్షురాలు ఆదిలక్ష్మి, కార్యదర్శి సురేష్ తెలిపారు. తనను రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా ఎన్నుకున్నందుకు సత్యారావు రాష్ట్ర ఎన్జీవో సంఘం కారదృదర్శి డీవీ రమణకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విజన్ బిల్డింగ్‌పై శిక్షణ

గజపతినగరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో జిల్లా స్థాయిలో 'విజన్ బిల్డింగ్' అనే కార్యక్రమంపై బుధవారం శిక్షణ ఇవ్వనున్నట్టు ఏపీఎం నారాయణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25ఏళ్ల నుంచి సంఘాల్లో ఉన్న మహిళలు ఏ విధంగా కలలను సాకారం చేసుకుంటున్నారు? ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలతో ఎలా ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు? అనే విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు.

క్రికెట్ కిట్ వితరణ

రాజాం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డోలపేటకు చెందిన పేద క్రికెట్ క్రీడాకారుడు టొంపల జగదీష్ కు మార్కు లోలుగు సుశీలమ్మ మెమోరియల్ ఫౌండేషన్ సోమవారం రాత్రి రూ.20వేల విలువైన క్రికెట్ కిట్‌ను వితరణగా అందజేసింది. అండర్ 19 జాతీయ స్థాయి క్రికెట్ జట్టుకు జగదీష్ ఎంపికయ్యాడు. ఈ కార్యక్రమంలో ఆబోతుల శ్యామలరావు, బెజ్జిపురపు లక్ష్మణరావు, రాంబాబు, షణ్ముఖరావు, పాలవలస రాజగోపాలరావు, టొంపల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజాం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సొంత స్థలం ఉండి... గృహాలు కావలసిన వారు , సొంత స్థలాలు లేని వారు ఈనెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కూటమి ప్రభుత్వం పట్టణాలలో 2 సెంట్లు, గ్రామాలలో 3 సెంట్లు ఇళ్ల నిర్మాణానికి మంజూరు చేస్తుందని తెలిపారు. స్థలంతో పాటు ఇళ్లు కూడా మంజూరు చేస్తుందని వివరించారు.

క్రైం న్యూస్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


విఠలరావు (ఫైల్)

పాలకొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కూరు ఎస్సీ వీధిలో నివాసం ఉంటున్న పాలకొండ డిపో ఆర్టీసీ డ్రైవర్ జామి విఠలరావు(49) అనుమానాస్పద రీతిలో మృతి చెందినట్టు ఎస్ఐ కె.ప్రయోగమూర్తి తెలిపారు. పోలీసులు అందించిన వివరాల మేరకు.. సోమవారం రాత్రి తన ఇంటిలో నిద్రించిన విఠలరావు మంగళవారం ఉదయం విగతజీవుడిగా ఉండటాన్ని గుర్తించిన ఆయన తండ్రి రామయ్య షాక్‌కు గురయ్యారు. విఠలరావుకు ఇటీవల కరుణతో వివాహమైంది. భార్య శ్రీకాకుళంలో ఉండటంతో ఆమెకు తన భర్త మరణించిన సమాచారం అందించారు. ఆమె బుక్కూరు చేరుకుని భర్త మృతదేహంపై గాయాలు ఉన్నట్టు గుర్తించారు. ఆమె ఫిర్యాదుతో పోలీసులు, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

లారీ, వ్యాను ఢీ: ఒకరి మృతి


నుజ్జునుజ్జయిన వ్యాన్

దత్తిరాజేరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): లారీ- బొలేరో వ్యాను ఢీకొన్న సంఘటనలో మంగళవారం ఒకరు మృతి చెందారు. స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేష్ తెలిపిన వివరాల మేరకు షికారుగంజి రోడ్డు జంక్షన్ సమీపంలో రామభద్రపురం వైపు నుంచి గజపతినగరం వైపు వెళుతున్న లారీ, ఎదురుగా వస్తున్న బొలెరో వ్యాను ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బొలేరో వ్యాను నుజ్జునుజ్జయింది. బొలేరో వ్యాను డ్రైవర్‌కు తీవ్రగాయాలు కావడంతో 108లో విజయనగరం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడిని జైపూర్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రెండు వాహనాలు బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించినట్టు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 64 మందికి జరిమానా

విజయనగరం క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, ఎస్ఐలు, సిబ్బంది చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 66 మంది పట్టుబడ్డారు. వీరిని కోర్టులో ప్రవేశపెట్టగా ఫస్ట్ అడిషనల్ సివిల్ న్యాయాధికారి ఎంఎస్‌హెచ్‌ఆర్ తేజా చక్రవర్తి 64 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ దామోదర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి ప్రమాదాలు నియంత్రించడంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టామని తెలిపారు. మద్యం తాగి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెడుతున్నామని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కొత్తవలస, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస-డిగిజాల రోడ్డులోని కుమ్మరిబంజరులోని ఒక వీధిలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు సీఐ షణ్ముఖరావు తెలిపారు. సోమవారం రాత్రి పేకాడుతున్నట్టు సమాచారం రావడంతో వెళ్లి ముగ్గురు నిందితులను పట్టుకుని వారి నుంచి 24 వేల 400 రూపాయలు, రెండు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పట్టుకున్న ముగ్గురు నిందితులపైన కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు చెప్పారు.

మానసిక వికలాంగుల పాఠశాల సందర్శన

కొత్తవలస, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస రాంజీనగర్‌లోనున్న చైతన్య మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలను విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు మంగళవారం సందర్శించారు. మానసిక వికలాంగుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస సీఐ షణ్ముఖరావు, ఎస్ఐ జోగారావు పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో వెనుకబాటు వద్దు

రేగిడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది నిర్దేశిత లక్ష్యాల్లో వెనుకబడితే సహించేది లేదని ఎంపీడీవో శ్యామలా కుమారి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. కొమిరి సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ చేశారు. పాలనాపరమైన సర్వేల్లో సిబ్బంది వెనుకబాటును గుర్తించిన ఎంపీడీఓ మాట్లాడుతూ సర్వేలు, పాలనాపరమైన అంశాల్లో ముందు వరుసలో ఉండాలన్నారు. ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

బొండపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు కలిసి కట్టుగా గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సూచించారు. వేండ్రాం గ్రామంలో మంగళవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు, పార్టీ మండల అధ్యక్షులు బొద్దల చిన్నంనాయుడు, దత్తిరాజేరు ఎంపీపీ గేదెల సింహాద్రప్పలనాయుడు పాల్గొన్నారు.

పనులు పూర్తికావు.. సాగునీరు అందదు

(3వ పేజీ తరువాయి)

ఆ ప్రాజెక్టు మాత్రం పూర్తి కాలేదు. రూ. రెండు కోట్ల అంచనాలతో ప్రారంభించిన ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.ఐదు కోట్లు వెచ్చించారు. అయినప్పటికీ ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందడం లేదు. అడారుగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే డీకేపట్నం, తాళ్లబురిడి, గోచక్క, బుదురువాడ తదితర పంచాయతీల రైతుల సాగునీటి ఇక్కట్లు తీరుతాయి. లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తే మరికొన్ని వందల ఎకరాలకు సాగునీరు అందే పరిస్థితి ఉంది. కానీ ఎందుకో ఈ ప్రాజెక్టును ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా పట్టించుకోవడం లేదు.

జంఝావతి హైలెవెల్ కెనాల్...

జంఝావతి హైలెవెల్ కెనాల్ ద్వారా సీతానగరం, బలిజిపేట, పార్వతీపురం మండలాల రైతులు వ్యవసాయ భూములకు సాగునీరు అందిస్తామని గత కాంగ్రెస్ ప్రభుత్వ కాలం నుంచి పాలకులు చెప్పుకొస్తున్నారు. కాని నేటికీ హైలెవెల్ కెనాల్ పనులు పూర్తికాకపోవడంతో ఆయా మండలాల్లో వ్యసాయ భూములకు సాగునీరు అందడం లేదు. జంఝావతి హైలెవెల్ కెనాల్ కోసం లక్ష్మీనారాయణపురం, తాళ్లబురిడి, పెదమరికి తదితర ప్రాంతాలకు చెందిన రైతులు తమ విలువైన భూములను త్యాగం చేశారు. అయినా ఫలితం లేకపోయింది. నేటికీ పనులు పూర్తి కాకపోవడంతో రైతన్నలు మండిపడుతున్నారు.

వరహాలగెడ్డ పరిస్థితి ఇదీ..

వరహాలగెడ్డ ప్రాజెక్టు ద్వారా సుమారు 800 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం 300 ఎకరాలకు కూడా నీరు అందించలేని దుస్థితి. ఈ ప్రాజెక్టు షట్టర్లు పూర్తిగా పాడై పోయాయి. కాలువల నిర్వహణను పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో అవి పిచ్చిమొక్కలతో నిండాయి. కాలువ పనులుచేపడితే వందల ఎకరాలకు సాగునీరు అందే పరిస్థితి ఉంటుందని రైతులు చెబుతున్నప్పటికీ అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదు.

మూడేళ్లకుపైగా నిరీక్షణ

(3వ పేజీ తరువాయి)

ఎన్నో రకాల వ్యయప్రయాసలకు గురయ్యారు. ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని భావించి ప్రైవేటు ఉద్యోగాల వైపు వెళ్లలేదు. వారంతా కానిస్టేబుళ్ల శిక్షణ కోసం ఎదురుచూస్తున్నారు. అయితే జిల్లా పోలీస్ వర్గాలు మాత్రం ఫిబ్రవరిలో శిక్షణ ప్రారంభించే అవకాశమున్నట్టు చెబుతున్నారు. వీలైనంత త్వరగా శిక్షణను ప్రారంభించాలని అభ్యర్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

సీఎం పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు

(మూడో పేజీ తరువాయి)

మరమ్మతు పనులు చేపట్టారు. రంగులతో కొత్త శోభను తీసుకొచ్చారు. సీఎం పర్యటన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ పరిశీలించారు. హెలీప్యాడ్‌ను సైతం భామిని మోడల్ స్కూల్ సమీపంలోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పాలకొండ డీఎస్పీ రాంబాబుతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. బహిరంగ సభా వేదికకు సమీపంలోనే అనుకూలమైన ప్రాంతం ఉండడంతో ఆర్‌అండ్‌బీ ఈఈ ఎస్.రామ చంద్రరావు హెలీప్యాడ్ పనులు చేపట్టారు. ఆ ప్రాంతంలో కంచె నిర్మాణంతో పాటు అవసరం మేరకు వాటరింగ్ చేపట్టాలని డీఎస్పీ ఆదేశించారు. ఆదర్శపాఠశాల, కళాశాల భవనంలోని అన్ని గదుల్లో రంగులు వేయాలని జేసీ సూచించారు. ఈ పరిశీలనలో ఏఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్ష కమిషనర్ శ్రీనివాస్, విద్యాశాఖా ధికారులు, ఇంజనీరింగ్, విద్యుత్‌శాఖాధికారులు ఉన్నారు.

మెగా పీటీఎం నిర్వహణకు సన్నద్ధం

(మూడో పేజీ తరువాయి)

సాధించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు ఉపాధ్యాయులు వందరోజుల ప్రణాళికను రూపొందించారు. ఈ వంద రోజుల్లో విద్యార్థులు ఏ విధంగా టెన్త్ పరీక్షలకు సిద్ధం కావాలి. ఎలా చదవాలి.. తదితర అంశాలను ప్రత్యేకంగా ఈ మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో చర్చించనున్నారు.

నిధుల సమస్య..

● మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలకు నిధుల సమస్య వెంటాడుతోంది. ఈ కార్యక్రమం నిర్వహణకు కొంతమంది ఉపాధ్యాయులు తమ సొంత నగదును వెచ్చించాల్సి వస్తుంది. వాస్త వంగా పాఠశాలలకు నిర్వహణకు విద్యార్థుల సంఖ్యను బట్టి నిధులు మంజూరవుతాయి. వాటితో పీటీఎం నిర్వహించొచ్చు. కానీ ఆ నిధులు పాఠశాల నిర్వహణకే సరిపోవడం లేదు.

● మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం రోజున భోజనాలు , స్నాక్స్ , టెంట్లు ఏర్పాటుకు కనీసం రూ.ఐదు వేల నుంచి రూ.8 వేల వరకు అవసరం. ఈ మొత్తాన్ని ఉపాధ్యాయులు భరించాల్సి వస్తోందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. ఉపాధ్యాయుల సంఖ్యను బట్టి ఒక్కొక్కరూ రూ. 500 నుంచి రూ.1000 వేసుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి ప్రత్యేక నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరుతున్నారు.

7న పార్వతీపురంలో హైందవ సభ



మాట్లాడుతున్న శ్రీనివాస్

బెలగాం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): హిందూ సంస్కృతిని, ధర్మాన్ని రక్షించేందుకు ఏర్పడిన ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 7న పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదా నంలో హైందవ సభ నిర్వహిస్తున్నట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం విద్యా సర్వమంగళదేవి పీఠం ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. హిందూ ధర్మాన్ని రక్షించేందుకు 1925లో ఆర్ఎస్ఎస్‌ను స్థాపించారన్నారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతి జిల్లాలో హైందవ సభలు తలపెట్టామని, అందులో భాగంగా పార్వతీపురంలో ఈ సభను నిర్వహి స్తామన్నారు. సమావేశంలో హైందవ జిల్లా నాయకుడు రవి ఉన్నారు.

బోధనపై నిర్లక్ష్యం వహించవద్దు

గరుగుబిల్లి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యా బోధనపై నిర్లక్ష్యం వహించరాదని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మంగళవారం పెద్దూరు, గరుగుబిల్లి ప్రాథమిక పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. నిబంధనల మేరకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో సందర్శించారు. చిన్నారుల హాజరు, పౌష్టికాహారం పంపిణీని పరిశీలించారు.

తాగునీటి బోరు ప్రారంభం

పాలకొండ, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ఎం.సింగుపురంలో తాగు నీటి బోరును మంగళవారం జనసేన నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రణస్థలం అప్పలరామినాయుడు, రాంబాబు, రవి, రమేశ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. బోరు ఏర్పాటుకు గానూ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.లక్ష వెచ్చించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

కొమరాడ, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి):మావోయిస్టుల బంద్ పిలుపు మేరకు కొమరాడ పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు మంగళవారం నాకా బందీ నిర్వహించారు. ఎస్ఐ నీలకంఠం వాహనాలను తనిఖీ చేశారు.

స్థానిక ఎన్నికల్లో పసుపు జెండా ఎగురవేయండి

●రాష్ట్ర మంత్రి సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో పసుపు జెండా ఎగుర వేయాలని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి సాలూరులో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో శతశాతం కూటమి విజయం సాధించాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదో అని తెలుసుకోవాలన్నారు. అదే నిజమైన భరోసాతో కూడిన నాయకత్వమన్నారు. పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు కలిసి గ్రామ స్థాయిలో ఉన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలు అనుభవించిన కష్టాలను అందరికీ గుర్తు చేయాలన్నారు. సాలూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చెప్పాలన్నారు. ఈ నెల 5న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌కు తప్పనిసరిగా మీ పరిధిలోని పాఠశాలల్లో హాజరుకావాలని కోరారు. సమావేశంలో మండల, టౌన్ పార్టీ ప్రెసిడెంట్‌లు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు అండ

●సాలూరు: సీఎం సహాయనిధి పేదలకు అండగా నిలుస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో రూ.6 లక్షల 23వేల 950 విలువైన చెక్కులను ఆమె లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సాలూరు మండలంలోని పెదపదం గ్రామానికి చెందిన మత్స రమణమ్మకు రూ.60 వేలు, మక్కువకు చెందిన రేగాపు లక్ష్మణరావుకు రూ.68,573, కొనిస అనిల్‌కుమార్‌కు రూ.1,1736, మక్కువ మండలంలోని ఎ.వెంకంపేటకు చెందిన చింతల లక్ష్మికి రూ.57,586, తామరపల్లి ఈశ్వరరావుకు రూ.41,84లు, మెంటాడ మండలం పెదమీడపల్లి గ్రామానికి చెందిన వేమరాపు రామకృష్ణకు రూ.1,29,629, సాలూరు పట్టణంలోని 22వ వార్డుకు చెందిన బర్ల జాహ్నవికి రూ.26,772, ఒకటో వార్డుకు చెందిన పురమ రవితేజకు రూ.1,38,570 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలిపారు.

కొత్తవలస బీటీ రహదారి ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): రెల్ల నుంచి యారన్నగూడ మీదుగా కొత్తవలస వరకు ఉపాధి నిధులతో రూ.145 లక్షలతో నిర్మించిన తారు రోడ్డును మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సదుపాయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ కడ్రక కళావతి, ఎస్టీ కమిషన్ సభ్యుడు కడ్రక మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు అడ్డాకుల నరేష్, కూటమి నేతలు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న భూదేవి

పాలకొండ, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): భామిని మండలంలో 5న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో పాల్గొనేందుకు సీఎం వస్తున్నారన్నారు. భామిని మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలల్లో నిర్వహించే సమావేశాల్లో సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొం టారన్నారు. సమావేశంలో అరకు పార్లమెంట్ నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు వారాడ సుమంత్‌నాయుడు, తూర్పు కాపు బోర్డు డైరెక్టర్ గండి రామినాయుడు, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు గుమ్మడి సింహాద్రి, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు మజ్జి జయశంకర్, చౌంగ శివానంద్, సాసుబిల్లి బుజ్జి తదితరులున్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోండి

సీతానగరం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంగా పనులు లేక ఇబ్బందులు పడుతున్న భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి తోలాపు రమేష్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో పనులు లేక ప్రత్యామ్నాయంగా భవన నిర్మాణ రంగంలో పనులు లభిస్తాయని ఈ రంగాన్ని ఎంచుకున్నామన్నారు. గృహ నిర్మాణానికి అవసరమయ్యే ఐరన్, సిమెంటు, ఇటుక, ఇసుక, మెటీరియల్ ధరలు అమాంతంగా పెరగడంతో పనులు లభించడం లేదన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిలో 12 వేల కోట్లు పన్నుల రూపంలో వచ్చిన డబ్బులు ఉన్నాయని, వీటిని కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాల్సి ఉండగా ఇతర పథకాలకు ఖర్చు చేయడం తగదన్నారు. జనవరి 4న విశాఖలో జరగనున్న సీఐటీయూ 18వ అఖిల భారత మహా సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్.రాము, ఆర్.శంకరరావు, బి.లక్ష్మునాయుడు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల స్థాయి పెరగాలి

సీతంపేట రూరల్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాల స్థాయి మరింత పెరగాలని డిప్యూటీ ఈవో జి.రామ్మోహనరావు అన్నారు. మంగళవారం ఆయన మల్లిలోని గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్యానల్ సిబ్బందితో కలిసి ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. పాఠశాలలో విద్యా విషయక, పరిపాలన రికార్డులు, మెనూ అమలు, నిధుల నిర్వహణ రికార్డులను పరిశీలించారు. రానున్న పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని గిరిజన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని ప్రిన్సిపాల్ వాసు దేవరావుకు సూచించారు. ప్యానల్ ఇన్‌స్పెక్షన్‌లో జి.దివాకర్, పి.ధర్మారావు, కె.కృష్ణమూర్తి, ఎస్.ప్రేమకుమారి, జె.రోజాలక్ష్మి, పి.క్రాంతికుమారి, పద్మ, సుబ్బారావు, ఎల్.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచండి

పాలకొండ, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.హిమప్రభ డిమాండ్ చేశారు. మంగళవారం సీడీపీవో పి.రంగలక్ష్మికి ఆమె వినతిపత్రం అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ నెల 12న కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపడతామన్నారు. గర్భిణులు, చిన్నపిల్లలు, బాలింతలకు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీలు ఎంతో సేవ చేస్తున్నారన్నారు. వారికి జీతాలు పెంచుతామని హామీ ఇచ్చినా అమలు కాలేదన్నారు. వినతిప త్రం అందజేసిన వారిలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, పాలకొండ ప్రాజెక్టు నాయకులు జి.శారద, జి.జెస్సీబాయి, టి.లక్ష్మి, శ్యామల, శ్రీదేవి, రజని పాల్గొన్నారు.

డీడీవో కార్యాలయం ప్రారంభం రేపు

బొబ్బిలి రూరల్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలో నూతనంగా నిర్మించిన బొబ్బిలి డివిజన్ డెవలప్‌మెంట్ అధికారి కార్యాలయం, ఉపాధి హామీ కార్యాలయాలను గురువారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రారంభించనున్నారని డీడీవో ఎం.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్చువల్‌గా కార్యాలయాలను డిప్యూటీ సీఎం ప్రారంభించనున్నరని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విజయచంద్ర

బెలగాం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందు బాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మంగళవారం 18వ వార్డులో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికి వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ పథకాలు, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాలు ఉండటాన్ని గుర్తించిన ఆయన శానిటేషన్‌పై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్యలపై స్పందించిన ఆయన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సురేష్, కౌన్సిలర్లు బడే గౌరునాయుడు, మధు, టీడీపీ నాయకులు గొట్టాపు శివ, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతుల స్వీకరణ

పార్వతీపురం రూరల్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలో సమస్యలపై ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మంగళవారం వినతులు స్వీకరించారు. వెంకంపేటలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● ఇదిలా ఉండగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 5న నిర్వహించనున్న టీచర్స్, పేరెంట్స్ సమావేశానికి హాజరుకావాలని ఎమ్మెల్యేను ప్రిన్సిపాల్ శైలజరాణి ఆహ్వానించారు. అందుకు ఎమ్మెల్యే తప్ప కుండా హాజరవుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకుడు ఆకుల రాజు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

సీతానగరం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): చినంకలాం ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు సత్యనారాయణపై మంగళవారం డ్వామా ఏపీడీ త్రివిక్రమరావు విచారణ చేశారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ గడిచిన ఏడాదిలో పనులు చేపట్టని 19 మంది వేతనదారులకు మస్తర్లు వేసి బిల్లులు చెల్లించారని గ్రామస్థులు, వేతనదారులు డ్వామా పీడీకి బహిరంగ సభలో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విచారణ చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంతో 19 మంది వేతన దారులను విచారించామన్నారు. అందులో 9 మందికి బిల్లులు చెల్లించినట్టు గుర్తించామన్నారు. అలాగే రికార్డుల్లో ఎక్కువ తప్పులు ఉన్నట్టు గమనించామన్నారు. దర్యాప్తు నివేదికను డ్వామా పీడీ కె.రామచంద్రరావుకు అందజేస్తామన్నారు.

ప్లాస్టిక్ రహిత మండలంగా మారుద్దాం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మక్కువ రూరల్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహితంగా మక్కువ మండలాన్ని మార్చేందుకు వ్యాపారులు సహకరించాలని ఎంపీడీవో ఎస్.అర్జునరావు, మేజర్ పంచాయతీ ఈవో బి.శ్రీనివాసరావు వ్యాపారులను కోరారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, వ్యాపారులతో కలిసి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వ్యాపారులు ఇకపై ప్లాస్టిక్‌ను వాడవద్దన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని కొనసాగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకపై గుడ్డ సంచులను వాడాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ, ఆర్ఐ కె.శ్రీనివాసరావు, పోలీసులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై దృష్టి సారించండి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

గరుగుబిల్లి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు ఆర్థిక అక్షరాస్యతపై దృష్టి సారించాలని వైద్య శాఖ అధికారి ఎస్.సూర్యప్రకాశ్ సూచించారు. మంగళవారం సుంకిలో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాలకు చెందిన జాతీయ సేవా పథకం శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ అక్షరాస్యతతో విద్య, ఉద్యోగవకాశాలు కలుగుతాయన్నారు. ఆన్‌లైన్ సాంకేతికతతో నైపుణ్యాలు, కమ్యూనికేషన్ మెరుగుపడతాయన్నారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి అవసరమైన మందులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.రవీంద్ర, ఎంపీటీసీ సభ్యుడు వై.శ్రీనివాసరావు, కార్యక్రమ అధికారి డాక్టర్ వి.దీప్తి, కళాశాల సిబ్బంది దివ్య ప్రశాంతి, ఎస్.వంశీకృష్ణ, ఎం.మారుతి, వైద్య సిబ్బంది వై.కుసుమ, పి.సుశీల, ఎం.నాగమణి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శ్రావణ్‌కుమార్ నాయుడు

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు

గరుగుబిల్లి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానాలతో దిగుబడులు సాధించవచ్చునని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఎం.శ్రావణ్‌కుమార్ నాయుడు సూచించారు. మంగళవారం గిజబలో పంట మార్పిడి విధానంపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు రబీలో మినుము, కంది, ఆముదం, సజ్జ, జొన్న, గోరు చిక్కుడుతో పాటు పలు రకాల పంటలు సాగు చేయాలన్నారు. వ్యవసాయానికి సంబంధించి పెట్టుబడులు తగ్గించేందుకు ప్రకృతి విధానాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పంట మార్పిడి విధానంతో అధిక దిగుబడులతో పాటు తెగుళ్ల ఆశించవన్నారు. ఖరీఫ్‌లో వరి పంట కోసిన వారం రోజుల్లో అపరాలు వేయాలన్నారు. అలాగే చేపల పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, రవితేజ, యూనిట్ ఇన్‌చార్జిలు పోలినాయుడు, వెంకటనాయుడు, ఉమ, భవానీ, లలిత, అపర్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపడతాం: ఎస్పీ

బెలగాం/సాలూరు, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానని మంత్రి అనధికార పీఏ సతీష్ ఆర్థికంగా దోచుకుని, లైంగిక వేధింపులకు పాల్పడ్డారని మహిళ చేసిన ఫిర్యాదుపై, అలాగే.. తనపై, మంత్రి తనయుడిపై అసత్య ప్రచారాలు చేసి కుటుంబ ప్రతిష్ఠకు భంగం కలిస్తున్నారని మహిళ పై మంత్రి పీఏ చేసిన ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాల యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరు వర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదులపై సాలూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. రెండు కేసులకు సంబంధించిన ఆధారాలను దర్యాప్తు కోణంలో భాగంగా ఫోరెన్సిక్ నిపుణుల అభిప్రాయం కోసం పంపించామన్నారు. సాంకేతికంగా అన్ని కోణాల్లో లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, చట్టప్రకారం విచారణ జరిపి సమగ్రమైన ఆధారాలతో దోషులను గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కేసులో ఎటువంటి రాజకీయ ప్రలోభాలకు ఆస్కారం ఇవ్వబోమన్నారు. పోలీసులు ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నారనేది అవాస్తమన్నారు. నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ వెల్లడించారు.

గిరిజన జాతిని అవమానిస్తారా?

●ఐటీడీఏ అధికారుల తీరుపై గిరిజన సంఘాల ఆగ్రహం

సీతంపేట రూరల్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను కాపాడాల్సిన ఐటీడీఏ అధికారులు గిరిజన జాతిని అవమానించే చర్యలకు పాల్పడట ఎంతవరకు సమంజసమని గిరిజన సంఘ నాయకులు ప్రశ్నించారు. గడచిన కొద్ది రోజుల ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెట్టుగూడ జలపాతం, ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో సుందరీకరణ పనులను చేపట్టారు. అందులో భాగంగా మెట్టుగూడ జలపాతంతో పాటు పార్క్ లోపల భాగంలో రంగులతో తీర్చిదిద్దారు. అలాగే గిరిజనసంస్కృతి, సంప్రదాయాలు, పండగలు, ఆచారాలు తెలియజేసేలా చిత్రాలను వేయించారు. ఇంతవరకు బాగానే ఉన్న ఈ గిరిజన చిత్రాలను మెట్టుగూడ జలపాతం వద్ద పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల గోడలపై వేయించడాన్ని గిరిజన జేఏసీ అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబయోగి ఖండించారు. ఐటీడీఏ అధికారుల తీరును తప్పుబట్టారు. తమ జాతి సంస్కృతిని మరుగుదొడ్ల గోడలపై వేయించి అవమాన పరుస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని సరిచేయకుంటే ఉపేక్షించేది లేదని వారు హెచ్చరించారు.

మాదకద్రవ్యాల నివారణకు సహకరించండి



మక్కువలో నిర్వహిస్తున్న ర్యాలీ

మక్కువ రూరల్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నివారణకు ప్రజలు సహకరించాలని ఈగల్ టీమ్ పోలీస్ అధికారులు కోరారు. మంగళవారం మక్కువ, సాలూరు మండలాల్లోని మామిడిపల్లి, శంబర కవిరిపల్లి, మక్కువ గ్రామాల్లో ఈగల్ టీమ్ అభ్యుదయం పేరిట ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో సైకిల్ యాత్ర అనంతరం మామిడిపల్లి, మక్కువలోని ఉన్నత పాఠశాలల్లో డ్రగ్స్ నివారణ, నియంత్రణపై అవగాహన సదస్సులు నిర్వహించారు. మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో మహిళలు, యువకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సైకిల్ ర్యాలీకి గిరిజన మహిళలు థింసా నృత్యంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కొటియా సీఐ క్రాంతికుమార్, సాలూరు రూరల్ ఎస్ఐ నరసింహమూర్తి, వైద్యాధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పాలకొండ, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని ఆర్.కె.బీచ్‌లో జనవరి 4న తలపెట్టిన సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని చెక్‌పోస్టు సెంటర్, ఆటో స్టాండ్ వద్ద మహాసభల వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేటర్లకు మేలు చేసేందుకు కార్మికవర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయని ఆరోపించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సీఐటీయూ అగ్రభాగాన ఉందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కాద రాము, బి.ప్రసాద్, ఎం.రాము, ఆర్.హరి, పి.జయరాం, అశోక్, లక్ష్మీనారాయణ, బి.రమేష్, సింహాచలం పాల్గొన్నారు.

●గరుగుబిల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా సీఐటీయూ కార్యదర్శి రమణ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో మహాసభలు నిర్వహణపై కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు డి.వెంకటనాయుడు, ఎస్.అప్పడు, పి.గోపాల్, బి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.